క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఏవో



ఏవో స్వర్ణలతకు అభినందనలు తెలుపుతున్న వీఏఏలు

మద్దిపాడు: మండల వ్యవసాయశాఖ అధికారిణిగా స్వర్ణలత గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో వీఏఏలు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా ఆమె వీఏఏలను సచివాలయాల వారీగా పరిచయం చేసుకొని మండలంలోని స్థితిగతులను ఆమె తెలుసుకున్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

సంతనూతలపాడు: మండల తహసీల్దార్‌గా ఎస్ఎల్ నారాయణరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్కే మాబు సుభాని, మండలంలోని వీఆర్‌ఓలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారాణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

మద్దిపాడు: పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థులు దోమలతో బాధపడకుండా దోమల నివారాణ మందు పిచికారీ చేయించామని జిల్లా మలేరియా నివారణ అధికారి డీ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎస్సీ హాస్టల్ బీసీ హాస్టళ్లలో విద్యార్థులు రానున్న నేపథ్యంలో వైద్య శాఖ సిబ్బంది గురువారం సాయంత్రం స్ప్రే చేయించారు. విద్యార్థులకు దోమలు కుట్టకుండా ఈకార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెల్త్ సూపర్వైజర్ బాలకోటయ్య తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శ్రావణ్ కుమార్, ఆనంద్ మోహన్ పర్యవేక్షణలో ఒంగోలు నుంచి సబ్ యూనిట్ ఆఫీసర్ పీ శ్రీనివాసరావు బృందం పిచికారీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్ ఏ రాఘవులు, బీసీ హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

చీమకుర్తి రూరల్: స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాలులో ఉదయం 11 గంటలకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన కోరారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు



పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ గొర్రాలికొండ తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు గురువారం రాజ్యలక్ష్మి సమేత తిరుమలనాథస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు అభిషేకం, అర్చనలు, మంగళ హారతి తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి కొలువుదీరారు. అలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను మేళతాళాల మధ్య భక్తి పాటలు పాడుకుంటూ భక్తులు ఊరేగింపు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మా.. ఆశీర్వదించమ్మా: పాఠశాల ప్రాంగణంలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి మొక్కుతున్న విద్యార్థిని

బుడిబుడి అడుగులు బడి వైపు..

సాక్షినెట్‌వర్క్: 'అప్పుడే సెలవులు అయిపోయాయా.. ఇంకా కొన్ని రోజులుంటే ఎంత బాగుండో కదా. అని మనమందరం అనుకునేవాళ్లం.' మొదటి రోజు పాఠశాలు ప్రారంభం అవుతుంటే ఆ కిక్కే వేరుగుంటుంది. వేసవి సెలవుల తర్వాత పాఠశాల ప్రాంగణంలోకి అడుగుపెడుతుంటే తోటి స్నేహితులు ఒక్కొక్కరిగా ఎదురొస్తూ పలకరిస్తుంటే తెగ సంతోషం. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం అవడంతో ఉదయం ఒంగోలు నగరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు సందడిగా మారాయి. విద్యార్థులను తల్లిదండ్రులు వెంటబెట్టుకొని పాఠశాలల వద్దకు చేరే దృశ్యాలు, చిన్నారుల నవ్వులు కనిపించాయి.



తాతయ్యా..బైబై ! బండ్లమిట్ట పాఠశాల వద్ద తాతయ్యకు టాటా చెప్తున్న చిన్నారులు





తమ పిల్లలను పాఠశాలలో వదిలేందుకు వస్తున్న తల్లిదండ్రులు

కాన్వెంట్ వద్దు.. అంగన్‌వాడీ ముద్దు



అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ, సిబ్బంది



పేర్నమిట్టలో పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

మద్దిపాడు: చిన్నారులకు కాన్వెంట్లు వద్దు.. అంగన్వాడీ సెంటర్లు ముద్దు అని ప్రకాశం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ అన్నారు. గురువారం ఆమె మండలంలోని వెల్లంపల్లి ఒకటో సెక్టార్‌లో బూరేపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చిన్నారులకు మానసిక ఎదుగుదల ముఖ్యమని, అటువంటి అభ్యసన కార్యక్రమాలు కేవలం అంగన్వాడీల్లోనే ఉంటుందన్నారు. ఆటపాటలతో కూడిన విద్య సెంటర్‌లలో అందిస్తారని ఆమె అన్నారు. ఈనెల 9 తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం ద్వారా మూడేళ్లు నిండిన 18 చిన్నారులను చేర్పించి అంగన్వాడీ కేంద్రంలో అక్షరభ్యాసం చేశామన్నారు. మూడున్నర సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో విద్య, శారీరక, మానసికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమానికి సీడీపీవో ఇవాంజెలిన్ అధ్యక్షతన నిర్వహించగా కార్యక్రమంలో సర్పంచ్ ఆర్ అంజమ్మ, సూపర్వైజర్, జీ జ్యోతి సీహెచ్ శివ నాగరాజ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట హైస్కూల్ గల అంగన్వాడీ కేంద్రంలో 40 మంది చిన్నారులకు పీడీ సువర్ణ సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య లభిస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో ఫణి రాజకుమారి, సూపర్వైజర్ రమా, హెచ్ఎం పార్వతి శాంతి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలి



ప్రకాశం భవనం వద్ద నిరసన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఒంగోలు టౌన్: కార్మికులు పది గంటలు పని చేయాలన్న నిబంధనను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును కాపాడుకుందాం అనే నినాదంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కుకు దేశంలో మంచి పేరుందన్నారు. ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. అందులో భాగంగా విశాఖకు సరిపడ ముడిసరుకు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, 2500 మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించారని మండిపడ్డారు. కార్మికుల పనిదినాలను పెంచడమే కాకుండా మహిళా కార్మికుల చేత రాత్రిపూట పనిచేయించాలన్న నిర్ణయం దుర్మార్గమైందన్నారు. ప్రభుత్వం కార్మికుల శ్రమ శక్తిని దోచుకునేందుకు పన్నాగాలు పన్నుతుందని విమర్శించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎస్‌డీ సర్దార్ మాట్లాడుతూ 32 మంది బలిదానాలు, 100 మంది ప్రజా ప్రతినిధుల రాజీనామాలతో విశాఖ ఉక్కును సాధించుకున్నామని తెలిపారు. బడా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకు వేలాది మంది కార్మికుల జీవితాలను దెబ్బతీయడానికి సిద్ధమవుతుందని చెప్పారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాం శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర ప్రజలు విశాఖ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇన్సాఫ్ నాయకుడు ఎంఏ సాలార్, మైనారిటీ నాయకులు షేక్. ఖాశీం, ముఠా కార్మిక సంఘాల నాయకుడు సుభా నాయుడు, ఆటో కార్మిక నాయకులు పోలేరయ్య, ఏవై రెడ్డి, గంగయ్య, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్ ఎంతో ఉపయోగం



ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం ఒంగోలు నగరంలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెయిర్–2025 నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ తర్వాత దేశ విదేశాల్లో ఎలాంటి కోర్సులు ఉన్నాయి.. ఏ కోర్సుకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయనే విషయాలను విద్యార్థులు తెలుసుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డితో కలిసి వివిధ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.కె న్యామత్, మేనేజింగ్ డైరెక్టర్ తౌహారా, బ్రిలియంట్ సంస్థ కోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఈవెంట్ మేనేజర్ నాగార్జున, యూనివర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేస్తేనే పథకాలు



ఈ-కేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి పావని

సంతనూతలపాడు: అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏవో పీ పావని పేర్కొన్నారు. గురువారం మండలంలోని పేర్నమిట్ట రైతు సేవా కేంద్రంలో ఈ-కేవైసీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవ పథకం రైతులకు వర్తించాలంటే రైతులందరూ తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే ఓటీపీ ద్వారా నమోదు చేసుకునే అవకాశం లేదన్నారు. కావున రైతులందరూ తప్పనిసరిగా మీ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను సంప్రదించి తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగి ఉన్న రైతులు సరైన సమయానికి ఈ కేవైసీ నమోదు చేసుకుంటేనే పథకానికి అర్హులు అవుతారని తెలిపారు. కావున రైతులందరూ తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమం అనంతరం గ్రామ సమీపంలోని పొలంలో మట్టి నమూనా తీసే విధానాన్ని రైతులకు వివరించారు.

వేతనాలు లేకపోతే కూలీలు ఎలా బతకాలి ?



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు: మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందకపోతే ఎలా బతకాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని ఆర్ లక్ష్మీపురం గ్రామంలో గురువారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. తమకు మూడు నెలల నుంచి డబ్బులు ఇవ్వలేదని కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు మూడు నెలల నుంచి ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారన్నారు. గతంలో తట్ట, పార, మంచినీళ్లకు అదనంగా డబ్బులు, సమ్మర్ అలవెన్స్ కూడా ఇచ్చేవారన్నారు. కాని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాటిని తొలగించిందని, బడ్జెట్లో నిధులు తగ్గించి ఉపాధి పనులను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయరాం, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మొదటి రోజు సమస్యల వెక్కిరింత



గుండ్లాపల్లి మెయిన్ పాఠశాలలో సందడి చేస్తున్న చిన్నారులు

మద్దిపాడు: వేసవి సెలవుల్లో చిన్నారులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఇక పాఠశాలలు పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. కాని మొదటి రోజే సమస్యలు వెక్కిరిస్తూ విద్యార్థులకు స్వాగతం పలికాయి. జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులను కల్పించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకం కూటమి పాలనలో పూర్తిగా నిర్వీర్యమైంది. కూటమి ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణాలను నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దింది. మండలంలోని గుండ్లాపల్లి మెయిన్ స్కూల్లో బాలికలకు యూనిఫారం అందలేదు. పలుచోట్ల పాఠశాలలో పుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. దీనిపై ప్రధానోపాధ్యాయులను అడగగా వచ్చిన వారినిబట్టి మరల తెప్పించి ఇస్తామంటూ తెలిపారు. ఇక ఉన్నత పాఠశాలలలో అయితే యూనిఫామ్, పుస్తకాలు, షూస్ ఇవ్వమన్నారు. యూనిఫారం విద్యార్థులు వేసుకున్న తర్వాతనే బ్యాగులు పంపిణీ చేయాలంటూ ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం.

సంతనూతలపాడు: మండలం కేంద్రం ఏపీ గురుకుల పాఠశాలలో మొదటి రోజు విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను ఎంపీపీ బుడంగుంట విజయ, పాఠశాల ప్రిన్సిపాల్ కే. అనంతయ్య తదితరులు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకానికి అందించిన సన్నబియ్యాన్ని వారు ప్రారంభించారు. వనరులను సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ కోరారు.

దర్శి వరకు రైళ్లు నడపాలి

దర్శి (కురిచేడు): నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్లో దర్శి వరకు ట్రాక్ పూర్తయినందున రైళ్లు నడపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. దర్శి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ రైల్వే లైన్ దర్శి వరకు పూర్తయినందున ఆగస్టు నుంచి రైళ్లు నడపాలని సీపీఎం జిల్లా నాయకులు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. దర్శిలో జరుగుతున్న రైల్వే పనులను సీపీఎం నాయకులు గురువారం పరిశీలించారు. 2012లో పనులు ప్రారంభించి 2020 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినా ఇప్పటికీ లైన్ మొత్తం పూర్తి కాలేదని పేర్కొన్నారు. 2024లోనే దర్శి వరకు 3 సార్లు రైల్ ట్రయల్ రన్ నిర్వహించారని, రైల్వే ఉన్నతాధికారులు పనులను పరిశీలించి దర్శి వరకు రైళ్లు నడుపుతామని ప్రకటించారని గుర్తుచేశారు. ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసరెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మిలు సంక్రాంతి నుంచి రైళ్లు నడుపుతామని ప్రకటించి 6 నెలలైనా ఇంతవరకు దర్శి ప్రజల కోరిక కలగానే మిగిలిపోయిందని రంగారావు విమర్శించారు. రైల్వే లైను నిర్మాణ పనుల కోసం రూ.2500 కోట్లు అంచనా వేశారని, ఇప్పటికి కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఇలా నత్త నడకన పనులు సాగితే ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, రైల్వే ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు దర్శి వరకు యుద్ధప్రాతిపదికన సిగ్నల్ వ్యవస్థ, స్టేషన్ల నిర్మాణాలు పూర్తి చేసి ఈ ఏడాది ఆగస్టు 15న పిడుగురాళ్ల నుంచి దర్శి వరకు రైళ్లు నడిపి దర్శి ప్రజల చిరకాల వాంఛ తీర్చాలని కోరారు. పరిశీలనలో సీపీఎం శాఖ కార్యదర్శులు ఉప్పు నారాయణ, షేక్ కాలేబాషా, ఈమని నాగేశ్వరరావు, ఆర్. రామకోటిరెడ్డి, బలుమూరి అంజిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు

మార్కాపురం టౌన్: జూలై నెల 10వ తేదీన గురుపౌర్ణమి పండగను పురస్కరించుకుని నేటి నుంచి సాయిబాబా మందిరంలో నెలరోజులపాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ పేర్కొన్నారు. తొలిరోజు సాయినామ సంకీర్తన నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సాయి భిక్ష కార్యక్రమం, జూన్ 19 నుంచి 25వ తేదీ వరకు సాయిజీవిత చరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఉపన్యాసాలు, 26 నుంచి జూలై 2 వరకు బాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం, జూలై 3 నుంచి 5వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, జూలై 6వ తేదీ షిరిడీ నుంచి వచ్చే బాబా పాదుకల ఊరేగింపు నిర్వహిస్తామని వివరించారు. జూలై 10వ తేదీన గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా సాయినాథునికి పంచామృతాభిషేకాలు, భక్తులకు అన్న సంతర్పణ, జూలై 11న రథోత్సవం నిర్వహిస్తామని మందిర ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి పీవీఎల్ఎస్‌పీ నాగరాజు, ఉపాధ్యక్షుడు గోపి, జాయింట్ సెక్రటరీ పవన్‌కుమార్, యూత్ ప్రెసిడెంట్ గోపాలుని కృష్ణమోహన్, కమిటీ సభ్యులు సూర్య నాగేశ్వరరావు, విజయ్, మహిళా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్య క్షుడు, దర్శి శాసన సభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. దర్శి మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా బండారు నాగపవన్ కుమార్, రైతు విభాగం అధ్యక్షుడిగా మనికొండ వెంకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా అంకాల శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాచపూడి భాస్కరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నంబూరి కీర్తిరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ జైనులుద్దీన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నగరికంటి ఏసన్న, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా ఎన్. ప్రశాంత్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా గోను వెంగళరెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా పేరం రమేష్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా పోటు సురేష్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా దేవతి గుప్త, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా దొంతు వెంకటేష్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా దొండపాటి వెంకటేశ్వరరెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా కురంగి శ్రీకాంత్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా పంటా చెన్నారెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా వెన్నా శ్రీనివాసరెడ్డి, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా నలదిమ్ము రమణారెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా అన్నెం సంజీవరెడ్డిలను నియమించారు.

దొనకొండ మండలం..

యూత్ వింగ్ అధ్యక్షుడిగా వడ్లమూడి వీర వెంకటేశ్వర్లు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తాలూరి లక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడిగా విప్పర్ల చిన్న మల్లయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా పత్తికొండ వెంకట సుబ్బయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వినుకొండ కొండలు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వల్లభ రామారావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మొఘల్ రహంతుల్లా బేగ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గోనె జాకబ్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా యరజర్ల రమేష్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా మువ్వా రమణయ్య, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా గొంగటి పోలిరెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా నాగిరెడ్డి శివారెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా కిన్నెర నాగేంద్ర ప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా పరిటాల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా బాపనపల్లి ఆంజనేయులు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా తమ్మినేని స్వాతి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా ద్వారకచర్ల చెంచిరెడ్డి, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఎనుబరి మనోహరరాజు, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా పగడాల వీరనారాయణ, పబ్లిసిటి వింగ్ అధ్యక్షుడిగా కందుల వెంకటేశ్వరరెడ్డిలను నియమించారు.

కురిచేడు మండలం..

యూత్ వింగ్ అధ్యక్షుడిగా కానాల శివారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మూలె నాగమణి, రైతు విభా గం అధ్యక్షుడిగా ముశికర యోగిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా అంకె వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కేసనపల్లి నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఎం.నాగాంజనేయులు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సయ్యద్ జానీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ముక్తిపూడి స్టాలిన్ పాల్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా తాటి ఏడుకొండలు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా గొట్టిపాటి రాములు, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా ఆరె శ్రీను, వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా షేక్ హుస్సేన్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కొత్తమాసు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా సయ్యద్ సుభానీ, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా గోపవరపు శ్రీలక్ష్మి, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా పోకూరి వెంకట సుబ్బారావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కోలా సంతోష్ కుమార్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా మల్లవరపు ఏసురత్నం, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా కిలారి శరత్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా ఇందూరి సుబ్బారెడ్డిలను నియమించారు.